రుణమాఫీపై రైతన్నల నిలదీత

ఖమ్మం జిల్లా వైరా తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతులు, రైతు సంఘం నాయకులు

రుణమాఫీ కోసం తహసీల్ ఎదుట ధర్నా

వైరాటౌన్, డిసెంబర్ 10 : ఎలాంటి షరతులు విధించకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా వైరా తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేశ్, బొంతు రాంబాబు మాట్లాడుతూ.. జిల్లాలో లక్ష మంది రైతులకు పైగా రుణమాఫీ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. బ్యాంకులో అప్పు ఉండి చనిపోయిన రైతులకు, పట్టాదారు పాస్ పుస్తకం లేని రైతులకు రుణమాఫీ చేయడం లేదని ఆరోపించారు. బ్యాంకులో అప్పు ఉన్న ప్రతి రైతుకు రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కేవీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు.

రుణమాఫీ చేయలే.. పింఛన్లు పెంచలే

పెబ్బేరు, డిసెంబర్ 10 : కాంగ్రెస్‌ను నమ్మి ఓట్లేసి అధికారం కట్టబెడితే తమను నట్టేట ముంచిందని పలువురు రైతులు, మహిళలు మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి వద్ద వాపోయారు. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలను మంగళవారం పరామర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ఇన్సూరెన్స్ చెక్కులను మృతుల కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బూడిదపాడు, కొత్తసూగూరు గ్రామాలకు చెందిన మహిళలు, రైతులు మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి వద్దకు వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వంపై అసహనం వ్యక్తంచేశారు. అర్హత ఉన్నా ఆసరా పింఛన్లు ఇవ్వ డం లేదని, ఏడాదైనా పింఛన్లు పెంచలేదని ఆరోపించారు. రుణమాఫీ అమలు సక్రమంగా లేదని, లక్షలోపు రు ణాలు ఉన్న వారికే మాఫీ చేశారని మండిపడ్డారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. రేవంత్ ప్రభుత్వ దురాగతాలు, ప్రజావ్యతిరేక చర్యలను ఎండగట్టాలని సూచించారు.

వనపర్తి జిల్లా బూడిదపాడులో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి వద్ద ప్రభుత్వ తీరును ఎండగడుతున్న వృద్ధురాలు, మహిళలు

వరంగల్ జిల్లా పర్వతగిరిలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడి రుణమాఫీ వివరాలను తెలుసుకుంటున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి. చిత్రంలో రైతులు

రైతును నిండా ముంచిన కాంగ్రెస్ సర్కారు

పర్వతగిరి, డిసెంబర్ 10: కాంగ్రెస్ సర్కారు రైతులను నిండా ముంచిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. మంగళవారం వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, డీసీసీ బ్యాంకులకు ఆయన రైతులతో కలిసి వెళ్లి రుణమాఫీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఐవోబీలో 450 మంది రైతులకు రుణమాఫీ వర్తించలేదని, కేవలం 22 మందికే ఇటీవల క్లియరెన్స్ వచ్చిందని బ్యాంకు సిబ్బంది తెలిపారు. పీఏసీఎస్‌బీలో 456 మంది రైతులకు 356 మందికి, డీసీసీబీలో రైతులకు రూ.25 కోట్ల రుణం ఉండగా రూ.14 కోట్లు మాత్రమే రుణమాఫీ అయినట్టు బ్యాంకర్లు ఎర్రబెల్లికి తెలిపారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. రైతుబంధుకు రాందాం చెప్పి రుణమాఫీ పేరుతో అనేక ఆంక్షలు విధించి రైతులను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు.

నాకెందుకు రుణమాఫీ కాలేదు?

కరీంనగర్ కలెక్టరేట్, డిసెంబర్ 10: రుణమాఫీపై గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం.. తనకెందుకు రుణమాఫీ చేయలేదో చెప్పాలని ఓ రైతు కలెక్టరేట్ ఎదుట నిరసనకు దిగాడు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన చింతల మల్లారెడ్డి అక్టోబర్ 2019లో తీసుకున్న రూ.1.09 లక్షల వ్యవసాయ రుణం మాఫీ కాకపోవడంతో అధికారుల చుట్టూ తిరిగి వేసారి మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన రైతు పండుగ ఫ్లెక్సీ వద్ద గంటకుపైగా నిల్చుని నిరసన తెలిపాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను సక్రమంగానే వడ్డీ చెల్లించినా.. తన పేరును రుణమాఫీ జాబితాలో చేర్చకపోవడం వెనుక ఆంతర్యమేంటని ప్రశ్నించాడు. ఎల్ఎండీలోని ఎస్‌బీఐలో రుణం తీసుకోగా జాబితాలో తన పేరెందుకు లేదని అడిగితే వ్యవసాయాధికారుల వద్ద తెలుసుకోవాలని సూచిస్తున్నారని, అక్కడికెళ్లి అడిగితే బ్యాంకులో అడగాలని చెప్తున్నారని వాపోయాడు.

కలెనగర్ కలెక్టరేట్ గేటు దగ్గర ఏర్పాటు చేసిన రైతు పండుగ ఫ్లెక్సీ వద్ద నిరసన తెలుపుతున్న బాధిత రైతు చింతల మల్లారెడ్డి

రుణమాఫీపై కొనసాగుతున్న లేఖల పరంపర

బోనకల్లు, డిసెంబర్ 10 : రుణమాఫీ కోసం ఖమ్మం జిల్లా రైతులు లేఖల పరంపర కొనసాగిస్తున్నారు. రూ.2 లక్షలలోపు రుణం మాఫీ కాలేదని లేఖలు రాసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పోస్టుచేస్తున్నారు. సోమవారం ముదిగొండ మండలం చిరుమర్రి గ్రామ రైతులు లేఖలు పోస్టుచేయగా.. మంగళవారం బోనకల్లు మండలం తూటికుంట్ల గ్రామ రైతులు తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి లేఖలు పోస్టుచేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా నాలుగు విడతల్లో 50 శాతం కూడా రుణమాఫీ కాలేదని అన్నారు. రుణమాఫీ పూర్తయ్యే వరకు పోరుబాట కొనసాగిస్తామని హెచ్చరించారు.

ముఖ్యమంత్రికి లేఖలు పంపుతున్న ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం తూటికుంట్ల గ్రామ రైతులు

మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో రోడ్డుపై బైఠాయించిన బీఆర్ఎస్ నాయకులు

షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలి

ఇనుగుర్తి, డిసెంబర్ 10: షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నదని ఆరోపించారు. ఇనుగుర్తిలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో 1800 మంది రైతులు రుణం తీసుకోగా, 695 మందికి మాత్రమే మాఫీ అయినట్టు తెలిపారు. దీన్నిబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం సగం మందికి కూడా మాఫీ చేయలేదని విమర్శించారు. రూ.2 లక్షల లోపు రుణం తీసుకున్న ప్రతి ఒక్క రైతుకు మాఫీ చేసే వరకు ప్రభుత్వంతో కొట్లాడుతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- పంట పెట్టుబడి, ఇంటి నిర్మాణానికి అప్పులు
- తీర్చేమార్గం లేక బలవన్మరణం

రైతు నాగన్నోళ్ల పోచయ్య(ఫైల్)

చిలిపిచెడ్, డిసెంబర్ 10: అప్పుల బాధతో పురుగులమందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలం జగ్గంపేటలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. జగ్గంపేటకు చెందిన నాగన్నోళ్ల పోచయ్య (50)కు పంట పెట్టుబడితో పాటు ఇల్లు కట్టుకోగా రూ.3 లక్షల వరకు అప్పులయ్యాయి. వ్యవసాయం లాభసాటిగా లేక , అప్పులు తీరేమార్గం కానరాక మనస్తాపం చెందిన పోచయ్య సోమవారం ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. రాత్రివరకు ఇంటికి రాకపోవడంతో పొలం వద్దకు సోదరుడు, కూతురు వెళ్లి చూడగా చెట్టు కింద పోచయ్య విగతజీవిగా కనిపించాడు. మృతుడి భార్య శేకమ్మ ఫిర్యాదు మేరకు ఏఎస్సై మిస్సింగ్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని నర్సాపూర్ ఏరియా దవాఖానకు తరలించారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

- హుస్నాబాద్‌లో విషాదం

శ్రీధర్‌గౌడ్(ఫైల్)

హుస్నాబాద్ రూరల్, డిసెంబర్ 10: అప్పుల బాధతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల వివరాల ప్రకారం.. పొట్లపల్లికి చెందిన బండి శ్రీధర్‌గౌడ్(30) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు పథకంతో ఆటోసరిగా నడవకపోవడం, కొన్ని నెలలుగా ఆటోకు కిస్తీలు చెల్లించకపోవడంతో ఫైనాన్స్ నుంచి ఒత్తిడి పెరిగింది. దీంతో మనోవేదనకు గురైన శ్రీధర్ సోమవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. మృతుడికి భార్య సౌమ్య, కుమారుడు ఉన్నారు. కాగా మృతుడు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న హుస్నాబాద్ నియోజకవర్గానికి చెందినవాడు కావడం గమనార్హం.

చేనేత కార్మికురాలు ఆత్మహత్య

- యాదాద్రి జిల్లాలో విషాదం

దోర్నాల విజయలక్ష్మి (ఫైల్)

రామన్నపేట, డిసెంబర్ 10 : ఆర్థిక ఇబ్బందులతో చేనేత కార్మికురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిపురంనకు చెందిన దోర్నాల విజయలక్ష్మి (50) చేనేత వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నది. ఆమె భర్త ప్రభాకర్ 2004లో మృతి చెందాడు. ఆమెకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక మంగళవారం చేనేత వస్త్రాలకు అద్దె రంగుల రసాయనం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. స్పృహతప్పిన విజయలక్ష్మిని కోడలు స్వప్న గమనించి కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో వారు విజయలక్ష్మిని నార్కట్‌పల్లి కామినేని దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కుమారుడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

రామయ్య ఉత్తర ద్వార దర్శనానికి ఆన్‌లైన్ టికెట్లు

భద్రాచలం, డిసెంబర్ 10: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో 31 నుంచి ప్రారంభమయ్యే వైకుంఠ ఏకాదశి మహోత్సవాల్లో ఉత్తర ద్వార దర్శనానికి ఆన్‌లైన్ టికెట్ల సదుపాయం కల్పించినట్టు ఆలయ ఈవో రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టికెట్ల ధరలు రూ. 2000, రూ.1000, రూ.500, రూ.250 చొప్పున నిర్ణయించినట్టు పేర్కొన్నారు. ప్రత్యక్షంగా ఉత్తర ద్వార దర్శనానికి హాజరుకాలేని భక్తుల సౌకర్యార్థం రూ.2000, రూ.1000తో https:// bhadradritemple. telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా బుధవారం ఉదయం 11 గంటల నుంచి బుకింగ్ సదుపాయం కల్పించామని తెలిపారు. ఆన్‌లైన్ టికెట్లు బుక్ చేసుకున్న భక్తులు 25 నుంచి జనవరి 10న ఉదయం 5 గంటల వరకు తానీషా కల్యాణ మండపంలో ఒరిజినల్ టికెట్లు పొందవచ్చని సూచించారు.

సీఎం చెక్కు చెల్లలే!

మొదటిపేజీ తరువాయి...

ఇప్పుడే పైసలు జమ చేయడం ప్రారంభించినట్టు తెలిసింది.

ఆర్భాటంగా నాలుగో విడత ప్రకటన..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలోనే రైతులకు రుణమాఫీతోపాటు అనేక సంక్షేమ పథకాలు అమలుచేసినట్టు చెప్పిన ప్రభుత్వం.. నవంబర్ 30న మహబూబ్‌నగర్‌లో రైతుపండుగ పేరుతో విజయోత్సవాలు నిర్వహించింది. ఈ సభలోనే సీఎం రేవంత్‌రెడ్డి అర్భాటంగా 3.13 లక్షల మంది రైతులకు సంబంధించిన రూ. 2747.67 కోట్లతో నాలుగో విడత రుణమాఫీ చేసినట్టు ప్రకటించారు. ఇందుకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మలతో పాటు ఇతర మంత్రులు స్వయంగా రైతులకు రుణమాఫీ చెక్కులు అందించారు. కానీ, ప్రచారం కోసం సభలో ఇచ్చిన చెక్కు.. చెల్లని చెక్కుగా మారిపోయిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతు పండుగ సందర్భంగా రుణమాఫీ అంటూ హడావిడి చేసిన ప్రభుత్వం.. ఆ తర్వాత నిధులు విడుదల చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బ్యాంకులకు రైతుల పరుగులు..

రూ.2 లక్షల్లోపు మొత్తం రుణాలు మాఫీ చేసినట్టు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో రైతులు బ్యాంకులకు పరుగెడుతున్నారు. తమకు మాఫీ అయ్యిందో లేదో తెలుసుకునేందుకు అధికారులను సంప్రదిస్తున్నారు. అయితే అప్పటికే గ్రామాల్లోకి రుణమాఫీ అయిన రైతుల జాబితాలు పంపించారు. ఆ జాబితాలో పేర్లున్న రైతులు బ్యాంకులకు వెళ్లగా వారికి నిరాశే ఎదురైంది. రుణమాఫీ పైసలు జమ కాలేదని బ్యాంకు అధికారులు చెప్పడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు.

ఇంకా 16 లక్షల మందికి బాకీ..

రూ.2 లక్షల వరకు రైతులందరికీ రుణమాఫీ చేసినట్టు ప్రకటించిన ప్రభుత్వం.. రూ.2 లక్షలకు పైగా రుణమాఫీకి సంబంధించి మాత్రం స్పష్టత ఇవ్వడం లేదు. వీరికి ఎప్పుడు రుణమాఫీ చేస్తారో కూడా తెలియని పరిస్థితి. ఇప్పటి వరకు ప్రభుత్వం నాలుగు విడతల్లో 25.35 లక్షల మంది రైతులకు రూ.20,616 కోట్ల రుణాలను మాఫీ చేసింది. వాస్తవానికి ప్రభుత్వం చెప్పిన లెక్క ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీకి అర్హులైన రైతులు 42 లక్షల మందికి రూ.31వేల కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వమే ప్రకటించిం ది. అయితే ఇప్పటి వరకు 25.35 లక్షల మంది రైతులకు మాత్రమే రూ.20,616 కోట్లు మాఫీ చేసింది. ఇంకా 16.65 లక్షల మందికి రూ.10,384 కోట్లు మాఫీ చేయాల్సి ఉంది.

ఇవీ రుణమాఫీ లెక్కలు..

- రుణమాఫీ చేయాల్సిన మొత్తం రూ.31వేల కోట్లు
- ఇప్పటి వరకు చేసిన మొత్తం రూ.20,616 కోట్లు
- ఇంకా చేయాల్సింది రూ.10,384 కోట్లు

సర్కారు ప్రకటించిన ప్రకారం..

- రుణమాఫీకి అర్హులైన రైతులు 42లక్షల మంది
- నాలుగు విడతల్లో రుణమాఫీ పొందిన రైతులు 25.35 లక్షలు
- ఇంకా రుణమాఫీ పొందాల్సిన రైతులు 16.65 లక్షలు.

పత్తి కొనుగోలు చేయాలని నారాయణపేట జిల్లా వడ్వాట్ గేటు వద్ద రాయిచూర్ హైవేపై బైఠాయించిన రైతులు

రోడ్డెక్కిన పత్తి రైతులు

- వెంటనే కొనాలని డిమాండ్
- రాయిచూర్ హైవేపై కర్షకుల ధర్నా

మాగనూరు, డిసెంబర్ 10 : పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ 150 మంది రైతులు రోడ్డెక్కారు. నారాయణపేట జిల్లా మాగనూరు మండలం వడ్వాట్ గేటు వద్ద రాయిచూర్ హైవేపై పత్తి లోడ్ ఉన్న ట్రాక్టర్లను ఉంచి బైఠాయించారు. వడ్వాట్ సమీపంలోని బసవేశ్వర జిన్నింగ్ మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రం వద్ద పత్తిని విక్రయించేందుకు సర్వ, అమరచింత, మరికల్, ధన్వాడ, మక్తల్, మాగనూరు, కృష్ణతోపాటు పలు మండలాల నుంచి రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నాలుగు రోజులు గడిచినా పత్తిని కొనుగోలు చేయకపోవడంతో మంగళవారం ధర్నాకు దిగారు. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఎస్సై అశోక్ బాబు చేరుకొని రైతులకు నచ్చజెప్పినా వారు వినలేదు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి వచ్చి పత్తిని కొనేలా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో రైతులు శాంతించారు.

జనగామ కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష చేపట్టిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె

- పలు జిల్లాల్లో విధులు బహిష్కరించి నిరసనలు
- ఎట్టకేలకు దిగివచ్చిన సర్కారు
- ఉద్యోగ సంఘాలతో చర్చలు

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : సమగ్రశిక్ష ప్రాజెక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, పేస్కేల్ అమలు చేయాలన్న డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తున్న ఉద్యోగులు మంగళవారం నుంచి సమ్మె బాటపట్టారు. కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల, జనగామ కలెక్టరేట్ల ఎదుట దీక్షలు చేపట్టారు. చాక్‌డౌన్, పెన్‌డౌన్ చేయడంతో కేజీబీవీలు, యూఆర్‌హెచ్‌లు, భవిత సెంటర్లల్లో విద్యాబోధన ఆగిపోయింది. తమను క్రమబద్ధీకరించాలని కోరుతూ కొంత కాలంగా ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఇందిరాపార్క్‌లో ధర్నాకు దిగి, ప్రభుత్వానికి సమ్మె నోటీసును అందజేశారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో సమ్మెకు దిగారు. దీంతో సర్కారు దిగివచ్చింది. పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌లో డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి, పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, పుల్గం దామోదర్‌రెడ్డి, ఉద్యోగుల సంఘం నేతలతో చర్చించారు. తమ పరిధిలో ఉన్న సమస్యలను నెల రోజుల్లో పరిష్కరిస్తామని, మిగతావి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని హామీనిచ్చి.. సమ్మెను విరమించాలని కోరారు. ఎస్ఎస్ఏ ఉద్యోగ సంఘం నేతలు మాత్రం సమ్మె విరమిస్తున్నట్టు ఎలాంటి ప్రకటన చేయలేదు.

- ఇవి కేసీఆర్ నీళ్లే..

బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం, గంధమల్ల ప్రాజెక్టుల ద్వారా గోదావరి నీళ్లు యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరులోని ఊర చెరువులోకి వచ్చి అలుగు పోస్తుండటంతో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం చెరువు అలుగుపై మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కేసీఆర్ పుణ్యం వల్లే నీళ్లు పారుతున్నాయని వారు ఆనందం వ్యక్తంచేశారు.

- మోటకొండూర్

దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- పెన్షన్‌ను రూ.6వేలకు పెంచేవరకు ఉద్యమిస్తాం
- మాజీ ఎమ్మెల్యే, సీపీఎం నేత జూలకంటి రంగారెడ్డి

చిక్కడపల్లి, డిసెంబర్ 10 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు పింఛన్ పెంచాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర నాయకుడు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. పెన్షన్‌ను 6 వేలకు పెంచేవరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. మంగళవారం దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పెన్షన్ రూ.6వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్క్ వద్ద దివ్యాంగులు మహాధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జూలకంటి మాట్లాడారు. రాష్ట్రంలో 43.02లక్షల మంది దివ్యాంగులుంటే అసరా పెన్షన్ 5.17 లక్షల మందికే వస్తున్నదని పేర్కొన్నారు. ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జ్యోతి మాట్లాడుతూ దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధ్యక్షుడు వెంకట్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో రాష్ట్ర కార్యదర్శి అడివయ్య, టీడీపీ సీనియర్ నాయకుడు సాయిబాబా, ఎన్‌పీఆర్‌డీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకాలు చేస్తరా? లేదా?

- హోంగార్డులకు ఉన్నతాధికారుల బెదిరింపులు
- సీఎం ఫొటోలకు పాలతో బలవంతపు అభిషేకాలు
- కొన్ని జిల్లాల్లో వ్యతిరేకిస్తున్న హోంగార్డులు
- 10 రోజులైనా ఇంకా అందని వేతనాలు

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): 'మీరు ముఖ్యమంత్రి గారి ఫొటోలకు క్షీరాభిషేకాలు చేయండి. ఇది డీజీపీ గారి ఆర్డర్. మీరు చేస్తారా? లేకపోతే డ్యూటీలు మార్చమంటారా?' అంటూ ఆయా జిల్లాల్లోని హోంగార్డులకు పోలీసు ఉన్నతాధికారుల నుంచి బెదిరింపులు వస్తున్నాయి. దీంతో కొందరు హోంగార్డులు తమకు ఇష్టం లేకపోయినా.. ఎక్కడ ఉద్యోగం పోతుందోనన్న భయంతో పాలతో అభిషేకాలు చేస్తున్నట్టు చెబుతున్నారు. 'అన్నా.. ఇవాల్టి వరకు జీతం పడలేదు. చాలా ఇబ్బందులు పడుతున్నాం. 79 రూపాయలు పెంచి.. వెయ్యి రూపాయలు పెంచినట్టు ప్రచారం చేసుకుంటున్నారు. మేము కొందరం క్షీరాభిషేకాలు చెయ్యబోమని తెగేసి చెప్పాం. అధికారులు ఎవరైనా మరీ బలవంతం చేస్తే.. పురుగుమందు డబ్బాలు పట్టుకొని పోలీస్ స్టేషన్లలోనే ఆందోళనలు చేస్తాం' అంటూ ఖమ్మానికి చెందిన ఓ హోంగార్డు ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా, ఇప్పటికే మహబూబ్‌నగర్, నిర్మల్, నల్లగొండలలో బలవంతంగా హోంగార్డులతో సీఎం ఫొటోలకు క్షీరాభిషేకాలు చేయించారని, ఖమ్మంలో చేయించేందుకు కూడా సమాయత్తం అయ్యారని, ఆ క్రమంలోనే ఉన్నతాధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు.

బీఆర్ఎస్ నిలదీస్తుందనే భయంతోనే..

హోంగార్డుల సమస్యలపై, డీఏగా అతితక్కువగా రూ.79 పెంచడంపై అసెంబ్లీలో బీఆర్ఎస్ ప్రశ్నిస్తుందనే భయంతోనే తమతో క్షీరాభిషేకాలు చేయిస్తున్నారని హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'రూ.79 పెంపుతో హోంగార్డులు సంతోషంగా ఉన్నారు' అన్నట్టు బలవంతంగా చూపిస్తున్నారని తమ బాధను మీడియా ముందు వ్యక్తంచేస్తున్నారు.

ట్రాన్స్‌జెండర్స్‌కు ఉన్న విలువ మాకు లేదు..

హోంగార్డులుగా పోలీసుశాఖలోకి తీసుకున్న ట్రాన్స్‌జెండర్స్‌కు ఇస్తున్న విలువ ఎన్నో ఏండ్లుగా పనిచేస్తున్న తమకు ఇవ్వడం లేదని వాపోతున్నారు. వారు ఉద్యోగంలో చేరడంతోనే డ్యూటీ అలవెన్స్‌ను ఇచ్చిన ప్రభుత్వం.. తమకు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం 75 ఏండ్ల హోంగార్డుల సర్వీసును అవమానపర్చడమేనని అంటున్నారు. ఇకనైనా హోంగార్డుల సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించాలని కోరుతున్నారు. తమను పర్మినెంట్ చేసి, రోజుకు రూ.1500 వేతనం ఇస్తామని చెప్పిన మాటను సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని కోరుతున్నారు.